

జిల్లా కాంగ్రెస్ మహిళా అధ్యక్షులుగా గోసాలదేవి

ప్రజాశక్తి-రైల్వేకోడూరు/పుల్లంపేట



అన్నమయ్య జిల్లా కాంగ్రెస్ పార్టీ మహిళా అధ్యక్షులుగా గోసాలదేవిని నియమించినట్లు కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు కె.శాంతయ్య తెలిపారు. ఈ సందర్భంగా గోసాలదేవి మాట్లాడుతూ తనకు ఈ పదవికి సహకరించిన పిసిసి అధ్యక్షులు వై.ఎస్.షర్మిల, రాష్ట్ర మహిళా అధ్యక్షులు తాంతియా కుమారి, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర, జిల్లా నాయకులకు ఆమె కృతజ్ఞతలు తెలియజేశారు. నాపై నమ్మకం ఉంచి పదవి ఇచ్చినందుకు అన్నమయ్య జిల్లాలో కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేస్తామన్నారు. అన్ని నియోజకవర్గాలలో కన్వీనర్లను 2024 ఎమ్మెల్యే అభ్యర్థులతో కలసి కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తల కార్యకర్తలతో కలిసి మహిళల కమిటీలు ప్రకటిస్తామని పేర్కొన్నారు. రాబోవు ఎన్నికలలో ఇటు రాష్ట్రంలోనూ అటు కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడానికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు.

ఇవిఎం, స్ట్రాంగ్ రూములకు పటిష్ట భద్రత : కలెక్టర్

ప్రజాశక్తి-మదనపల్లె

ఇవిఎం, స్ట్రాంగ్ రూములను భద్రతపరంగా మరింత పటిష్టవంతం చేయాలని కలెక్టర్ అభిషిక్త్ కిషోర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. శనివారం మదనపల్లిలోని ప్రభుత్వ మహిళ డిగ్రీ కళాశాల, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను అధికారులతో కలిసి కలెక్టర్ ఆకస్మికంగా సందర్శించారు. మొదట ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా మదనపల్లె పట్టణ, గ్రామీణ ప్రాంతాలలో ఎంత మంది ఓటర్లు ఉన్నారు, ఎన్ని పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి, ఒక్క మదనపల్లి మండలంలో ఎన్ని లోకేషన్లు ఉన్నాయి, పోలింగ్ కేంద్రాలు ఎన్ని, అందులో ఒకే కేంద్రంలో ఐదు పోలింగ్ కేంద్రాలు ఉన్నవి ఎన్ని, నాలుగు, మూడు, రెండు, ఒకటి ఉన్న కేంద్రాలు ఎన్ని, ప్రతి పోలింగ్ కేంద్రంలో అవసరమైన సౌకర్యాలు ఉన్నాయా, ప్రతి పోలింగ్ కేంద్రానికి బయట పీఎస్ నెంబర్లు ఏర్పాటు చేశారా తదితర అంశాలలో అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రతి పోలింగ్ కేంద్రంలో సరైన వెలుతురు ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అదేవిధంగా మదనపల్లి పట్టణ ప్రాంతంలో ఎన్ని ఫారంలు పెండింగ్ లో ఉన్నాయి, ఇందులో ఫారం 6, 7, 8, 8ఏ ఎన్ని వచ్చాయి వాటిపై ఎలాంటి చర్యలు తీసుకున్నారు, తుది జాబితా తర్వాత మార్పులు చేర్పులకు ఎన్ని దరఖాస్తులందాయి వాటి పరిష్కారం అంశాలపై కూడా ఆర్‌డిఓ, మున్సిపల్ కమిషనర్‌ను వివరాలు అడిగి తెలుసుకున్నారు. వచ్చిన ఫారంలను త్వరితగతిన పరిష్కరించాలని అధికారులకు సూచించారు. అనంతరం మదనపల్లిలోని జిల్లా పరిషత్ హైస్కూల్‌లో ఏర్పాటు చేయనున్న ఇవిఎంల స్ట్రాంగ్ రూములను విస్తృతంగా కలియతిరిగి ప్రతి గదిని పరిశీలించారు. ఏయే నియోజకవర్గాల ఇవిఎంలను అక్కడ భద్రపరుస్తారని కలెక్టర్ అడగగా... మదనపల్లె పట్టణ గ్రామీణ, నిమ్మనపల్లె రామసముద్రం మండలాల ఈవీఎంలను భద్రపరచడం జరుగుతుందని ఆర్డీఓ కలెక్టర్కు వివరించారు. అధికారులకు సూచించారు. స్ట్రాంగ్ రూములు ఏమైనా లీకేజీలు ఉన్నాయని పరిశీలించాలని, స్కూల్లో మరమ్మత్తులు ఏవైనా ఉంటే వెంటనే చేయించాలని ఆదేశించారు. స్ట్రాంగ్ రూము మరమ్మతులను త్వరితగతిన పూర్తి చేయాలని, ఇవిఎంల స్వీకరణ, పంపిణీ కార్యక్రమానికి పక్కా ప్రణాళిక రూపొందించుకోవాలన్నారు. ఎక్కడ ఎలాంటి పొరపాట్లు లేకుండా ఎన్నికల కమిషన్ జారీ చేసిన మార్గదర్శకాల మేరకు పకడ్బందీగా ఏర్పాట్లు పూర్తి చేసి ఎన్నికలను విజయవంతం చేయాలని కలెక్టర్ పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆర్‌డిఓ హరిప్రసాద్, మున్సిపల్ కమిషనర్ ప్రమీల, తహశీల్దార్ రమాదేవి, ఎన్నికల సూపర్వైజర్లు, సెక్టోరోల్ అధికారులు, బిఎల్‌ఓలు పాల్గొన్నారు.



మదనపల్లె మహిళా డిగ్రీ కళాశాల పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్

కురబలకోట : తంబళ్లపల్లె నియోజకవర్గం ఇవిఎం స్ట్రాంగ్ రూములకు కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్లు ఉండాలని, రెవెన్యూ, పోలీసు శాఖలు సమన్వయంతో పనిచేసి ఏర్పాట్లు పూర్తిచేయాలని కలెక్టర్ అభిషిక్త్ కిషోర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. అంగళ్లులోని మిట్స్ కళాశాలలో ఏర్పాటు చేయనున్న తంబళ్లపల్లె నియోజకవర్గం ఇవిఎం స్ట్రాంగ్ రూములను, ఇవిఎంల పంపిణీ, స్వీకరణ కేంద్రం ఏర్పాట్లను అధికారులతో కలిసి కలెక్టర్ పరిశీలించారు. కార్యక్రమంలో తంబళ్లపల్లె రిటర్నింగ్ అధికారి రాఘవేంద్ర పాల్గొన్నారు.

నోటీసులతో ఉద్యమాలు ఆపలేరు : యుటిఎఫ్



యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి వెంకటరమణకు నోటీసు ఇస్తున్న పోలీసు

ప్రజాశక్తి-మదనపల్లి

ముఖ్యమంత్రి ఇచ్చిన హామీ మేరకు పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని సిపిఎస్ సంఘాల ఆధ్వర్యంలో ఈ నెల 18వ తేదీన విజయవాడలో జరగబోవు ఓట్ ఫర్ ఓపిఎస్ ధర్నా కార్యక్రమానికి వెళ్లకూడదంటూ యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి పురం వెంకటరమణకు పాఠశాలకు వెళ్లి పోలీసులు నోటీసులు ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నోటీసులతో ఉద్యమాలను ఆపలేరని పేర్కొన్నారు. ఇది అప్రజాస్వామికమని తెలిపారు. నోటీసులు ఇవ్వడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. జిపిఎస్ రద్దుచేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలంటూ జరిగే కార్యక్రమాలను ప్రభుత్వం నిరంకుశంగా అడ్డుకుంటున్నదని ఇది సరైన పద్ధతి కాదని, ముఖ్యమంత్రి ఇచ్చిన హామీ మేరకు పాత పెన్షన్ పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి నిర్బంధాల ద్వారా ఉద్యమాలను అణచాలనుకోవడం అవివేకమని తాను ఇచ్చిన మాటకు కట్టుబడి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. లేనిపక్షంలో ఏ పార్టీ అయితే పాత పెన్షన్ పునరుద్ధరిస్తామని హామీ ఇస్తుందో వారికే పది లక్షల ఉద్యోగ ఉపాధ్యాయులు వారి కుటుంబ సభ్యులు రాబోయే ఎన్నికల్లో మద్దతు తెలుపుతారని తెలిపారు. రానున్న ఎన్నికల్లో రాజకీయ పార్టీలు తమ మ్యానిఫెస్టోలో సిపిఎస్ రద్దు అంశాన్ని చేర్చాలని కోరారు. ఈ ధర్నాకు వెళ్లవద్దంటూ జిల్లాలోని పలు మండలాలకు చెందిన ఉపాధ్యాయులకు, ఉద్యోగులకు పోలీసులు నోటీసులు ఇచ్చారన్నారు.

'సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురండి'

ప్రజాశక్తి-రాయచోటి

ఎన్నికలకు సంబంధించి ఏ సమస్య అయినా ఎన్నికల అధికారుల దృష్టికి తీసుకురావాలని కలెక్టర్ అభిషిక్త్ కిషోర్ రాజకీయ పార్టీల ప్రతినిధులతో తెలిపారు. శనివారం సాయంత్రం స్థానిక రాయచోటిలోని కలెక్టరేట్లో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలెక్టర్ సార్వత్రిక ఎన్నికలు 2024పై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటర్ల జాబితా, పోలింగ్ కేంద్రాలు, వెబ్ కాస్టింగ్, సున్నితమైన, అతి సున్నితమైన పోలింగ్ కేంద్రాలు, తదితర అంశాలపై ఏ సమస్యలు ఉన్నా ఎన్నికల అధికారుల దృష్టికి తీసుకురావాలన్నారు. రాజకీయ పార్టీల ప్రతినిధులు ఇచ్చే ఫిర్యాదులపై త్వరగా చర్యలు తీసుకోవాలని ఎన్నికల అధికారులను కలెక్టర్ ఆదేశించారు. సమావేశంలో జెసి ఫర్మాన్ అహ్మద్‌ఖాన్, డిఆర్‌ఓ సత్యనారాయణ, ఇఆర్‌ఓలు, ఎఇఆర్‌ఓలు, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, ఎలక్షన్ సెల్ అధికారులు పాల్గొన్నారు.



రాజకీయ నాయకుల సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ అభిషిక్త్ కిషోర్

పొలికేక

ప్రజా'దృష్టి'

కేంద్ర ప్రభుత్వ రైతు వ్యతిరేక విధానాలకు నిరసన పెల్లుబికింది. ప్రధాని స్థాయిలో రాతపూర్వకంగా ఇచ్చిన హామీని పక్కనబెట్టి మూడు రైతు వ్యతిరేక నల్లచట్టాలను అమలు చేయడానికి సిద్ధపడడం, అమలు కమిటీ వేయడం, రైతు సంఘాల ప్రతినిధులకు, మేధావులకు, వ్యవసాయరంగ నిపుణులకు సంబంధించిన వారెవరికీ స్థానం లేకుండా చేయడంలోని మరమ్మేమిటో తెలియడం లేదు. రైతు వ్యతిరేక చట్టాల అమలును నిరసిస్తూ దేశరాజధాని ఢిల్లీలో రైతులు చేపట్టిన ధర్నాకు సంఘీభావంగా దేశవ్యాప్తంగా గ్రామీణ బంద్‌కు వామపక్షాల ఆధ్వర్యంలోని రైతు సంఘాలు, కార్మికులు, వ్యవసాయ కార్మిక సంఘాలు పిలుపునిచ్చిన సంగతి తెలిసిందే. శుక్రవారం కడప, అన్నమయ్య జిల్లాల్లోని 66 మండలాల పరిధిలోని గ్రామీణ ప్రాంతాల్లో నిర్వహించిన గ్రామీణ బంద్ ప్రశాంత వాతావరణంలో ముగిసింది. కేంద్ర ప్రభుత్వ రైతు వ్యతిరేక విధానాలను రైతు సంఘాల నాయకులు తూర్పారపట్టడంలో సఫలీకృతమయ్యారని చెప్పవచ్చు. రైతాంగ నల్లచట్టాల గురించి రైతు సంఘాల నాయకులు, మేధావులు మాట్లాడుతున్నారే తప్పా క్షేత్రస్థాయిలోని అసలైన రైతులకు రైతు వ్యతిరేక చట్టాలు, ఎంఎస్‌పి ధరల అమలు వంటి మాటలు చేరలేదని తెలుస్తోంది. తాజా గ్రామీణ బంద్ నేపథ్యంలో ఇటువంటి రైతాంగ నల్ల చట్టాలు, అందులోని నిబంధనలు రైతుల చెవికి సోకినట్లు తెలుస్తోంది. ఫలితంగా రైతుల్లో చైతన్యం వెల్లివిరిసే అవకాశం ఉంది. ఇంతటితో ఆగకుండా మరింత ఉధృతంగా రైతుల్లోకి తీసుకెళ్లాల్సిన అవసరం ఏర్పడింది. కేంద్రంలోని బిజెపి సర్కారు రైతు వ్యతిరేక కార్పొరేట్ అనుకూల విధానాలను రైతులు అర్థం చేసుకునే అవకాశం ఉంది. లేనిపక్షంలో పంజాబ్, హర్యానా రాష్ట్రాల రైతులకు పరిమితమయ్యే ప్రమాదం పొంచి ఉంది. ఉత్తరాధి రాష్ట్రాల రైతులకు రైతు వ్యతిరేక చట్టాల దుష్ఫలితాల ప్రభావాల గురించి తెలిస్తే రాజకీయాలపై తీవ్ర ప్రభావం చూపించే అవకాశం ఉంది. రాష్ట్రంలో అధికార, ప్రతిపక్ష పార్టీల ఎంపీలు రైతు వ్యతిరేక చట్టాలకు పార్లమెంటులో రహస్యంగా ఓట్ల వేయడం ద్వారా మద్దతు తెలిపి, ప్రస్తుతం జెండాల మాటున దాక్కున్న వైనం ఆందోళన కలిగిస్తోంది. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో రైతులు వీధుల్లోకి వస్తే అధికార, ప్రతిపక్ష పార్టీలు ముసుగు తొలగిపోనుంది. లేనిపక్షంలో కేంద్రంలోని బిజెపి సర్కారుతో రాష్ట్రంలోని వైసిపి, టిడిపి, జనసేన పార్టీలు అంటకాగుతూ రైతులకు తీరనిద్రోహం చేస్తుండడం ఆందోళన కలిగిస్తోంది. రాష్ట్రంలోని రైతుల్లో ఏకీభావం కొరవడిన ఫలితంగా ప్రధాన రాజకీయ పార్టీలు పబ్బం గుడుపుకుంటున్నాయి. రాష్ట్ర ప్రయోజనాలు తాకట్టు పెట్టడం సరే, రైతాంగ నల్ల చట్టాల గురించి పెదవి విప్పకపోగా మద్దతు తెలపడం బరితెగింపును గుర్తుకు తెస్తోంది. దేశంలోని రైతులను కార్పొరేట్లకు బలి పశువుల తరహాలో బలి చేయడానికి వెనుకాడకపోవడం దౌర్భాగ్యమనే చెప్పాలి. ఇటువంటి రాజకీయ పార్టీలకు రైతులు బుద్ధి చెప్పాలి. ఇటువంటి పార్టీలను గుర్తించి వాటికి సహాయ నిరాకరణ చేయాలి. ఎంపీలను నిలదీయాలి, వాటిని రద్దు చేసే వరకు నిలదీతలు కొనసాగాలి. అప్పుడు దేశీయ రైతులు బతుకులు బాగు పడతాయని చెప్పవచ్చు.

– ప్రజాశక్తి - కడప ప్రతినిధి

టెట్, డిఎస్‌సిపై ఉచిత అవగాహన సదస్సు

ప్రజాశక్తి - రాయచోటి

కొత్త పేటలోని వైష్ణవి స్టడీ సెంటర్‌లో టెట్, డిఎస్‌సిపై ఉచిత అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు దుళ్ళవారిపల్లి శ్రీనివాసులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులు, ప్రతిభ అధ్యాపకులచే వైష్ణవి స్టడీ సెంటర్ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహిస్తున్నామన్నారు. ఇందులో తెలుగు మూడు రోజులు, ఇంగ్లీష్ మూడు రోజులు సిలబస్‌ను చెబుతామన్నారు. అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

సాధికారత కల్పనకు నాయకులు పాటుపడాలి

ప్రజాశక్తి-మదనపల్లి

అట్టడుగు వర్గాల వారికి సాధికారత కల్పించెందు కోసం దేశ నాయకులు పాటుపడాలని జ్ఞానాంబిక కళాశాల కరస్పాండెంట్ డాక్టర్ రాటకొండ గురుప్రసాద్ అన్నారు. శనివారం కళాశాలలోని సమావేశ మందిరంలో జరిగిన కార్యక్రమాన్ని ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ యూత్ ఫర్ యూనిటీ అండ్ వాలంటరీ యాక్షన్ అనేది లాభాపేక్ష లేకుండా అట్టడుగు వర్గాలకు చెందిన వారితో సాధికారత కల్పించేందుకు, వారి హక్కులను పొందడంలో వారికి సహాయం చేస్తుందన్నారు. బానిస మనస్తత్వాన్ని పారద్రోలేందుకు, మన సంప్రదాయాల గురించి గర్వపడాలని, అభివృద్ధి చెందిన భారతదేశ లక్ష్యమైన 'పంచప్రాణ్'ని చేపట్టాలని ఎర్రకోట ప్రాకారాల నుండి దేశప్రజలందరికీ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ పిలుపునిచ్చారన్నారు. బానిస మనస్తత్వాన్ని పారద్రోలేందుకు, మన సంప్రదాయాల గురించి గర్వపడాలని, అభివృద్ధి చెందిన భారతదేశ లక్ష్యమైన 'పంచప్రాణ్'ని చేపట్టాలని ఎర్రకోట ప్రాకారాల నుండి దేశప్రజలందరికీ ప్రధాన మంత్రి పిలుపునిచ్చారన్నారు. జీవితమంతా ఐక్యత, సమగ్రత కోసం అంకితం చేయండని తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రమాదేవి, హెడ్‌కానిస్టేబుల్ రామమూర్తి, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

వైసిపితోనే అభివృద్ధి సాధ్యం : 'పోలా'

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం కొనసాగేందుకు మరోసారి వైసిపికి అధికారం ఇవ్వాలని కాకతీయ విద్యా సంస్థల చైర్మన్, మున్సిపల్ కౌన్సిలర్ పోలా రమణా రెడ్డి ప్రజలను కోరారు. శనివారం ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డిని గెలిపించాలని కోరుతూ 21వ వార్డులో పర్యటించి ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి వైసిపిని బలపరచాలని కోరారు. పేద, బడుగు, బలహీనవర్గాల అభ్యున్నతికి నిరంతరం పాటుబడే నాయకుడు వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అని, అలాంటి నాయకుడు తిరిగి అధికారం పొందితే రాష్ట్రంలో పేదరికాన్ని పూర్తిగా నిర్మూలించేందుకు పోరాడతారని తెలిపారు. రాజంపేట నియోజకవర్గంలో పేదల ఆశా జ్యోతి ఆకేపాటి అమర్ నాథ్ రెడ్డిని అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో పలువురు వైసిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

కడపలో ఎన్నికల వేడి

కడపలో ఎన్నికల వేడి రాజుకుంది. అధికార, ప్రతిపక్ష పార్టీలు అభ్యర్థులను ప్రకటించకముందే రాజకీయం పతాక స్థాయికి చేరుకుంది. ఇటీవల ప్రతిపక్ష, అధికార వైసిపి అభ్యర్థుల అనుచరులు ఫ్లెక్సీల చించివేతల దగ్గర నుంచి భౌతిక దాడులు, హత్యాయత్నాల పరంపర ఘటనలు హాట్ టాఫిక్‌గా మారాయి. టిడిపి అసెంబ్లీ ఇన్‌ఛార్జి ఆర్.మాధవి తనదైన శైలిలో అగ్రెసివ్ రాజకీయం చేయడంతో కేడర్‌లో ఉత్సాహం నెలకొంది. అధికార పక్ష వైసిపి అభ్యర్థి, ప్రత్యర్థి మహిళనే భావనతో ఎదురు దాడికి తంటాలు పడుతున్న వైనం ఆసక్తికరంగా మారింది. అధికార వైసిపి అభ్యర్థిగా భావిస్తున్న ఉప ముఖ్యమంత్రి అంజాద్‌బాషా, టిడిపి అభ్యర్థిగా భావిస్తున్న మాధవి మధ్య పదునైన విమర్శల నేపథ్యం చర్చనీయాంశంగా మారింది.



అగ్రెసివ్ రాజకీయంతో టిడిపి దూకుడు

ఎదురుదాడిలో అధికార వైసిపి తంటాలు

ఫ్లెక్సీల చించివేత.. సోషల్ మీడియాలో ట్వీట్ల జోరు

భౌతికదాడులు... ప్రతి దాడులతో వేడెక్కిన రాజకీయం



కడప టూటౌన్ పోలీస్‌స్టేషన్ ఎదుట ఆందోళన చేస్తున్న వైసిపి నాయకులు (ఫైల్‌ఫోటో)

ప్రజాశక్తి-కడప ప్రతినిధి

రెండు దఫాలుగా అంజాద్‌బాషా గెలిచి తిరుగులేని రాజకీయ ఆధిపత్యాన్ని నెరిపిన సంగతి తెలిసిందే. గత టిడిపి అభ్యర్థుల ప్రచారం మొదలుకుని ఎత్తు గడలకు భిన్నంగా ప్రస్తుత టిడిపి కడప ఇన్‌ఛార్జి ఆర్.మాధవి తనదైన అగ్రెసివ్ రాజకీయంతో అధి కార పార్టీని సవాల్ చేస్తుండడం చర్చనీ యాంశంగా మారింది. వైసిపి, టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థుల పేర్లను అధికారికంగా విడుదలకు ముందే ఇటువంటి తరహా రాజకీ యం నడవడం పలువురిని ఆకర్షిస్తోంది. టిడిపి అసెంబ్లీ ఇన్‌ఛార్జి హోదాలో ఇంటింటి ప్రచారం నిర్వహిస్తోంది. పదేళ్లలో అధికార పార్టీ అభ్యర్థి చేసిన అభి వృద్ధి పనుల తీరుపై విమర్శల గుప్పిస్తోంది. భూ కబ్జాలను, అక్ర మాలను ఎండ గడుతూ డిప్యూటీ సిఎంపై పదునైన విమర్శలు చేస్తోంది. ఆ విమర్శలకు అధికార పార్టీ సమాధానం చెప్పకోవల్సిన దుస్థితిలోకి జారుకుంది. టిడిపి విమర్శలకు ప్రతిగా డిప్యూటీ సిఎం శిబిరం నుంచి ప్రతి విమర్శలు, సవాళ్లు షరామామూలుగా మారాయి. విమర్శలు, ప్రతి విమర్శలు, సవాళ్ల పరిధిని దాటిపోయాయి. విమర్శల పరిణామాల అనంతరం ఫ్లెక్సీల చించివేత వరకు పరిస్థితి చేరుకుంది. వైసిపి కార్పొరేటర్ అనుచరునిపై టిడిపి హత్యాయత్నానికి పాల్పడిందనే ఆరోపణ ఉలికిపాటుకు గురి చేసింది. హత్యాయత్న ఘటనపై టిడిపి కౌంటర్ అటాక్ చేసినప్పటికీ వర్కవుట్ కాలేదని తెలు స్తోంది. ప్రతిపక్ష టిడిపి, అధికార వైసిపి కేడర్ పోలీసుస్టేషన్ ఎదుట బైటాయించడం, పరస్పరం విమర్శలు గుప్పించుకోవడంతో రాజకీయవేడి పతాకస్థాయికి చేరుకుంది. కడప అసెంబ్లీలో ముస్లిము ఓటర్లు 70 వేల వరకు ఉన్నారు. ఇటువంటి ప్రాంతంలో ముస్లిము యువకునిపై హత్యాయత్నం ఘటన తరహా ఫ్యాక్షన్ తరహా రాజకీయాన్ని ముస్లిమ్ సా మాజికవర్గం ఎలా స్వీకరిస్తుందో వేచి చూడాల్సి ఉంది.

టిడిపిని గ్రూపుల బెడద వేధి స్తోంది. అసమ్మతి నాయకులను ఏకతాటిపైకి తీసుకురావడం తలకు మించిన వ్యవ హారమనే వాదన వినిపిస్తోంది. సీనియర్ నాయకులైన లక్ష్మీరెడ్డి అనుచరుల్లో కొందరిని చేరదీయడం రెచ్చగొట్టినట్లు అవుతుందనే వాదన వినిపిస్తోంది. కడప అసెంబ్లీలో ముస్లిముల తరువాత బలిజ సామాజికవర్గ ఓటర్లు సుమారు 30 వేల నుంచి 50 వేల మంది ఉన్నారు. ముస్లిమ్ సామాజిక వర్గానికి చెందిన సీనియర్ నాయకులు అమీర్‌బాబు, బలిజ సామాజికవర్గానికి చెందిన మాజీ మంత్రి రామచంద్రయ్యను కలుపుకుంటే గట్టి పోటీ ఇవ్వగలిగే అవకాశం ఉందని చెప్ప వచ్చు. అధికార పార్టీ అభ్యర్థిపై అగ్రెసివ్ రాజకీయం నెరిపిన తరహాలో టిడిపిలోని గ్రూపులన్నింటినీ ఏకతాటిపైకి తీసుకు రావా ల్సిన అవసరం ఉంది. ఇటువంటి తరహా పరిణామాల పరంగా ఇప్పటివరకు ఒక్క అడు గూ ముందుకు పడకపోవడం గమనార్హం.

ఉద్యోగుల సమస్యల పట్ల నిర్లక్ష్యం విడనాడాలి

ప్రజాశక్తి-పీలేరు

ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యాయులకు చెల్లించాల్సిన బకాయిలను వెంటనే చెల్లించాలని పీలేరు జెఎసి డిమాండ్ చేసింది. జిల్లా ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయ జాయింట్ యాక్షన్ కమిటీ పిలుపు మేరకు శనివారం భోజన విరామ సమయంలో స్థానిక తహశీల్దారు కార్యాలయం ముందు ఉద్యోగులు నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలిపారు. ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్లు, కాంట్రాక్టు, అవుట్సోర్సింగ్ ఉద్యోగుల కోసం ప్రభుత్వం 12వ పీఆర్సీ వేసినా ఇప్పటి వరకు ఎలాంటి పురోగతి లేదని జెఏసి నాయకులు వాపోయారు. 12వ పిఆర్‌సి ఆలస్యమౌతుండడంతో 30 శాతం ఐఆర్‌ను ప్రకటించాలని, పిఎఫ్, జిపిఎఫ్, ఎపిజిఎల్‌ఐ రుణాలకు దరఖాస్తు చేసుకున్న వారికి వెంటనే వాటిని మంజూరు చేయాలని, కాంట్రాక్టు ఉద్యోగుల క్రమబద్ధీకరణ, అవుట్సోర్సింగ్, సమానపనికి సమాన వేతనం ఇవ్వాలని డిమాండు చేశారు. కార్యక్రమంలో పీలేరు జెఏసి నాయకులు, సభ్యులు పాల్గొని తమ నిస్సహాయతను వ్యక్తం చేశారు. **రైల్వేకోడూరు** : తహశీల్దారు కార్యాలయం వద్ద నుంచి జేఏసీ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా జెఏసి చైర్మన్ పి.ఓబులేసు మాట్లాడుతూ 30 శాతం మధ్యంతర భృతి వెంటనే ప్రకటించాలని, జిపిఎఫ్ పిఆర్‌సి అరియర్స్, సరెండర్ లీవ్, డిఎ ఆర్ఎస్ వెంటనే ఇవ్వాలని కోరారు. జిపిఎస్‌ని రద్దు చేసి ఒపిఎస్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జెఏసి కోశాధికారి షేక్ మహమ్మద్ అస్లాం, వైస్ ప్రెసిడెంట్ కె.సంతోష్‌రెడ్డి, గౌరీ శంకర్ సెక్రటరీ విజయ్‌వర్మ, అసోసియేట్ ప్రెసిడెంట్ జె.రవిశంకర్ పాల్గొన్నారు. **లక్కిరెడ్డిపల్లి** : ఉద్యోగ ఉపాధ్యాయ కార్మిక పెన్షనర్ల న్యాయమైన డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని లక్కిరెడ్డిపల్లి జెఏసి చైర్మన్ కొండూరు బలరామరాజు ప్రభుత్వాన్ని కోరారు. తహశీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం పట్టణంలో ఉద్యోగులు, ఉపాధ్యాయులు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎన్‌జిఓ కార్యదర్శి మల్‌రెడ్డి, ఉపాధ్యక్షులు దేవదానం, రామకృష్ణ, విశ్వనాథ, సాయిపీర్, జిల్లా ఉమెన్ వింగ్ అధ్యక్షులు శాంతమ్మ, పెన్షనర్ల సంఘం అధ్యక్షులు వి.వెంకటరమణ, రామచంద్ర, రహమతుల్లా, వివిధ శాఖల ఉద్యోగులు రహీం ,విమల్ కుమార్, వెంకటేష్, శ్రీనివాసులు, పెన్షనర్లు, కార్మికులు పాల్గొన్నారు.



తహశీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న ఉద్యోగులు

సేవాదళ్ రాష్ట్ర కార్యదర్శిగా తేజ

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్



ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు వైఎస్‌ఆర్ సేవాదళ్ రాష్ట్ర కార్యదర్శిగా తాను ఎంపికైనట్లు ఒంటిమిట్ట తేజ తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ తనపై నమ్మకంతో వైయస్ఆర్ సేవాదళ రాష్ట్ర కార్యదర్శిగా భాధ్యతలు ఇచ్చిన ముఖ్యమంత్రికి, రాజంపేట ఎంపీ మిథున్‌రెడ్డికి, రాజ్యసభ అభ్యర్థి మేడా రఘునాథ్‌రెడ్డికి, ఎమ్మెల్యే మేడా మల్లిఖార్జునరెడ్డికి, ఎంపీ నందిగం సురేష్, పార్టీ కార్యకర్తల సమన్వయకర్త పుత్తా ప్రతాప్‌రెడ్డికి, అన్నమయ్య జిల్లా అధ్యక్షులు గడికోటి శ్రీకాంత్‌రెడ్డికి, జిల్లా పరిషత్ చైర్మన్ ఆకేపాటి అమర్నాథ్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. రానున్న 2024 ఎన్నికల్లో రాష్ట్రంలో వైసిపి అధికారంలోకి వచ్చేందుకు శక్తి వంచన లేకుండా అహర్నిశలు కృషి చేస్తానని పేర్కొన్నారు.

శ్రీహరికోటను సందర్శించిన 'మిట్స్' విద్యార్థులు

ప్రజాశక్తి-మదనపల్లె

మదనపల్లె ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్ కళాశాలలోని బి.టెక్ కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ మూడవ సంవత్సరం చదువుతున్న విద్యార్థులకు ఇండస్ట్రియల్ విసిట్‌లో భాగంగా శ్రీహరికోటలోని షార్-ఇస్రోను సందర్శించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సి. యువరాజ్ తెలిపారు. ఇస్రో నింగిలోకి ఇన్సాట్ 3 డిఎస్ ఉపగ్రహాన్ని విద్యార్థులు శ్రీహరికోట అంతరిక్ష ప్రయోగ కేంద్రం సహారాలో వీక్షించినట్లు తెలిపారు. సాయంత్రం 5.35 నిమిషాలకు జిఎస్ఎల్‌విఎఫ్ 14. రాకెట్ నింగిలోకి దూసుకెళ్లిందని, విద్యార్థులు, అధ్యాపకులు ఎంతో ఆకస్తిగా ఈ కార్యక్రమంలో పాల్గొన్నట్లు తెలిపారు.



రాకెట్ లాంచింగ్‌ను వీక్షిస్తున్న మిట్స్ విద్యార్థులు




సమావేశంలో మాట్లాడుతున్న జెసి ఫర్మాన్ అహ్మద్‌ఖాన్

పోలింగ్ కేంద్రాల్లో సమస్యలు తలెత్తకుండా చూడాలి

- జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్

ప్రజాశక్తి-పీలేరు

పోలింగ్ కేంద్రాల నిర్వహణలో ఎలాంటి సమస్యలూ తలెత్తకుండా చూడాలని జిల్లా జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ తెలిపారు. శనివారం స్థానిక ఎంపిడిఓ కార్యాలయంలో ఎన్నికల నిర్వహణ కోసం విధులకు హాజరయ్యే సెక్టోరియల్ అధికారులు, పోలీస్ సెక్టోరియల్ ఆఫీసర్లు, సివిల్ సెక్టోరియల్ అధికారులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జెసి మాట్లాడుతూ పోలింగ్ కేంద్రాలలో ఎన్నికల కమిషన్ ఇచ్చిన లేఅవుట్ ప్రకారం అన్ని సౌకర్యాలు ఉండేలా చూడాలన్నారు. ఎన్నికల సందర్భంగా పోలింగ్ కేంద్రాల నిర్వహణపై బిఎల్‌ఓలను పలు ప్రశ్నలు అడిగి, పూర్తిస్థాయి అవగాహన కలిగి ఉండాలన్నారు. ఎన్నికల విధులలో బిఎల్‌ఓల పాత్ర చాలా ముఖ్యమైందని, పోలింగ్ సరళి పూర్తి అయ్యేంతవరకు వారే కీలక పాత్ర పోషిస్తారన్నారు. పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసే పాఠశాలల్లో విద్యుత్తు, తదితర సౌకర్యాలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఎన్నికల సమయంలో ఏర్పాటు చేయబోయే బారికేడింగ్‌పై పోలీసు సిబ్బందిని అడిగారు. ఓటు వేయడానికి వచ్చిన ఓటర్లకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకూడదన్నారు. ముఖ్యంగా ప్రభావిత ప్రాంతాలను గుర్తించాలని ఆదేశించారు. నియోజకవర్గ పరిధిలోని 93 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలలో వెబ్ కాస్టింగ్ ఉంటుందని, 281 కేంద్రాల్లోనూ వీడియో గ్రఫీ ఉంటుందని తెలియజేశారు. అధికారులు ఎప్పటికప్పుడు సమాచారాన్ని తమ ఉన్నతాధికారులకు తెలియజేయాలని సూచించారు. ముందుగా పీలేరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇవిఎంలను భద్రపరచడానికి స్ట్రాంగ్ రూముల ఏర్పాటుకు సాధ్యా అసాధ్యాలపై ఆరా తీశారు. ఎన్నికల పరికరాల పంపిణీకి కౌంటర్లు, ఫుడ్ కౌంటర్ల ఏర్పాటు, ఎన్నికల విధులకు హాజరయ్యే సిబ్బంది కోసం ఏర్పాటు చేసిన వాహనాల పార్కింగ్ సౌకర్యాలను పరిశీలించారు. అనంతరం జరిగిన సమావేశంలో పీలేరు స్పెషల్ డిప్యూటీ కలెక్టర్, ఓటర్ నమోదు అధికారిణి రమా, రాయచోటి డిఎస్‌పి మహబూబ్ బాష, పీలేరు, కెవి పల్లి, కలకడ, గుర్రంకొండ, వాల్మీకిపురం, కలికిరి మండలాల తహశీల్దారులు, ఎఇఆర్‌ఓలు మహబూబ్ బాష, నయాజ్ అహమ్మద్, ప్రియదర్శిని, శ్రీనాథ్, షేక్ ఖతీజున్ కుబ్రా, పి.విజయ కుమారి, పోలీసు అధికారులు పాల్గొన్నారు.



జంబు సూర్యనారాయణను సన్మానిస్తున్న సర్పంచ్‌లు

సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడిగా సూర్యనారాయణ

ప్రజాశక్తి-నందలూరు

మండల సర్పంచ్‌ల సంఘం అధ్యక్షునిగా నాగిరెడ్డిపల్లి మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ జంబు సూర్యనారాయణ ను ఏకగ్రీవంగా ఎన్నుకొన్నారు. శనివారం నారెడ్డిపల్లి సర్పంచ్ ఛాంబర్‌లో మండల సర్పంచ్‌ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సూర్యనారాయణను సర్పంచ్‌ల సంఘం అధ్యక్షునిగా ఎన్నుకున్నారు. అందరూ ఐక్యంగా కలిసి ముందుకు సాగుదామని ఎవరికి ఏ సమస్య వచ్చినా అందరం కలిసికట్టుగా ఉండాలని సర్పంచ్‌లు కలిసి తీర్మానించారు. కార్యక్రమంలో టంగుటూరు సర్పంచ్ మైనుద్దీన్, నల్ల తిమ్మాయపల్లె సర్పంచ్ గీతాల శిరీష నరసింహారెడ్డి, పాటూరు సర్పంచ్ అక్కిరెడ్డి స్వరూప, లేబాక సర్పంచ్ వెంకట నరసయ్య, టీవీపురం సర్పంచ్ లక్ష్మీదేవి, ఆడపూరు సర్పంచ్ ఎన్.చైతన్య భారతి, నందలూరు సర్పంచ్ మోదపోతుల సుభాషిని, మదనమోహనపురం సర్పంచ్ నిర్మల, ఎర్ర చెరువుపల్లి సర్పంచ్ మేడ రాజశేఖర్ రెడ్డి, పొత్తపి సర్పంచ్ సి.విజయ్‌కుమార్, నాయకులు నరసింహారెడ్డి, మోహన్ ఒడ్డి, మొదపోతుల రాము, నందలూరు భాస్కర్‌రెడ్డి, సి.భాస్కర్ పాల్గొన్నారు.

డిఎస్‌సి అభ్యర్థులకు ఉచిత పుస్తకాలు

ప్రజాశక్తి-కలికిరి

జిల్లాగ్రంథాలసంస్థ అధ్యక్షులు మధుబాల నేతృత్వంలో కలికిరి శాఖ గ్రంథాలయం అధికారి ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం పదిగంటలకు కుట్టి డీఎస్సీ కోచింగ్ సెంటర్ చిత్తూరు వారు డీఎస్సీకి అప్లై చేసిన విద్యార్థులకు సేవాదృక్పదంతో ఉచిత మెటీరియల్స్‌ను పంపిణీ చేయుచున్నట్లు గ్రంథాలయ అధికారి విజయ్ తెలిపారు. మెటీరియల్ పొందగోరు మొదటి 50 మంది విద్యార్థులు టెట్, డిఎస్‌సి దరఖాస్తులు, రెండు ఫోటోలతో గ్రంథాలయానికి హాజరు కావాలని కుట్టి కోచింగ్ సెంటర్ చిత్తూరు డైరెక్టర్ పవన్ కుమార్ అన్నారు. ముస్లిం మైనార్టీ విద్యార్థులకు ఉచిత కోచింగ్ ఇస్తామని తెలిపారు. ఈ అవకాశాన్ని డిఎస్‌సి అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.



జడ్‌పిటిసి దంపతులతో కలిసి విగ్రహప్రతిష్టాపనలో పాల్గొన్న ఆకేపాటి

విగ్రహ ప్రతిష్టాపనలో 'ఆకేపాటి'

ప్రజాశక్తి-నందలూరు

మండలంలోని ఆడపూరు గ్రామం దిగువ దళితవాడలోనూతనంగా ఏర్పాటు చేసిన సీత లక్ష్మణ హనుమాన్ సమేత శ్రీ రామచంద్ర స్వామి విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యకమంలో జడ్‌పి చైర్మన్ ఆకేపాటి అమర్నాథ్‌రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం జడ్‌పిటిసి గడికోట ఉషారాణి, గడికోట వెంకట సుబ్బారెడ్డి దంపతులు ఆకేపాటిని శాలువాతో ఘనంగా సత్కరించారు. కార్యకమంలో నందలూరు ఉప సర్పంచ్ ఇబ్బు, నాయకులు పాటూరువాసు, అరిగే హరిబాబు, ఆనాల మధుయాదవ్, మోదపోతులసుధా, కసిరెడ్డి నరసింహారెడ్డి, మహబూబ్ బాషా, ఆడపూరు నరసింహారెడ్డి, మౌలాలి, శంకర,రెడ్డయ్య పాల్గొన్నారు.

రేపు లబ్ధిదారులకు ఇంటి పట్టాలు పంపిణీ

ప్రజాశక్తి-బి.కొత్తకోట

నవరత్నాలు పేదలందరికీ ఇల్లు పథకంలో భాగంగా ఇళ్ల స్థలాలు మంజూరైన లబ్ధిదారులకు సోమవారం పట్టాలు పంపిణీ చేయనున్నట్లు తహశీల్దార్ పుణ్యవతి వెల్లడించారు.ఈ సందర్భంగా శనివారం ఆమె మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన నవరత్నాల్లో భాగంగా ఇళ్లు లేని నిరుపేదలకు పట్టాలు మంజూరు చేసి జగనన్న కాలనీ నిర్మిస్తున్న సంగతి విదితమే. 90 రోజుల స్కీమ్‌లో భాగంగా బి.కొత్తకోట పరిధిలో మంజూరైన ఇంటి పట్టాలను ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథ్‌రెడ్డి చేతుల మీదుగా లబ్ధిదారులకు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు.కార్యక్రమానికి లబ్ధిదారులు,అధికారులు హాజరై విజయవంతం చేయాలని తెలిపారు.



నీటి బోరును ప్రారంభిస్తున్న రాంప్రసాద్‌రెడ్డి

తాగునీటి సమస్య పరిష్కారం

ప్రజాశక్తి-లక్కిరెడ్డిపల్లి

మండలంలోని పందిల్లపల్లి పంచాయతీలోని జె.వడ్డేపల్లి గ్రామస్తులు కొన్ని నెలలుగా తాగునీటితో ఇబ్బందులు పడుతుండటంతో స్థానిక ప్రజలు నియోజకవర్గ టిడిపి నాయకులు మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డిని కలిసి సమస్యను వివరించారు. స్పందించిన రాంప్రసాద్‌రెడ్డి తన సొంత నిధులతో గ్రామంలో బోర్ పాయింట్ వేయించారు. గ్రామంలో పైపులైన్ ద్వారా ప్రతి ఇంటికి కుళాయిల ద్వారా తాగునీరు అందిస్తామని గ్రామస్తులకు తెలిపారు. తాగు నీటి సమస్యను పరిష్కరించిన రాంప్రసాద్ రెడ్డికి గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.

70 మంది యువకులు రక్తదానం

ప్రజాశక్తి - పెద్దముడియం

మండల కేంద్రంలో శనివారం కైరాన్ టెక్నాలజీస్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. స్థానిక యువకులు 70 మంది రక్తదానం చేశారు. కైరాన్ టెక్నాలజీస్ అధినేత వెంకటేశ్వరరెడ్డి మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో రక్తం అందుబాటులో లేక నిండు జీవితాలు గాలిలో కలిసి పోతున్నాయని తెలిపారు. రక్తదానం చేయడం వల్ల ఎన్నో ప్రాణాలు నిల బెట్టవచ్చని తెలిపారు. రక్తదానం పట్ల యువత సామాజిక స్పృహ కలిగి ఉం డాలని సూచించారు. 70 మంది యువ కులు స్వచ్ఛందంగా రక్తదానం చేయ డాన్ని ఎస్ఐ రామకృష్ణ, కైరాన్ టెక్నాలజీస్ అధినేత వెంకటేశ్వరరెడ్డి హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమానికి స్థానిక ఎపిజిబి మేనేజరు పురుషోత్తంరెడ్డి, ఇండియన్ రెడ్ క్రాస్ సంస్థ చైర్మన్ శివశంకర్‌రెడ్డి, ఎస్ఐ రామకృష్ణ ముఖ్యఅతిథులుగా పాల్గొన్నారు.

వైసిపి కోసం కృషి చేస్తా

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

వైసిపి కోసం అహర్నిశలు కృషి చేస్తానని పార్టీ జిల్లా జాయింట్ సెక్రటరి పోరెడ్డి జస్వంత్‌రెడ్డి తెలిపారు. తనను ఆ పదవిలో నియమించిన సందర్భంగా జస్వంత్‌రెడ్డి మాట్లాడుతూ సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డికి, ఎంపీ వైయస్ అవినాష్‌రెడ్డికి ధన్య వాదాలు తెలిపారు. రాబోయే ఎన్నికల్లో వైసిపి అత్యధిక మెజార్టీ గెలుస్తుందన్నారు. ఇచ్చిన మాట ప్రకారం, చెప్పిన ప్రతి హామీ నెరవేరుస్తూ, ప్రజల గుండెల్లో నిలిచిన నాయకుడు జగన్మోహన్‌రెడ్డి అని కొనియాడారు. మళ్లీ జగనన్నకే రాష్ట్ర ప్రజలు పట్టం కట్టేందుకు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. కడప జిల్లాలో ప్రజలకు ఏ సమస్య ఉన్నా ఎంపీ అవినాష్‌రెడ్డి పరిష్కరిస్తూ వస్తు న్నారన్నారు.

సంక్షేమ వారధులు వాలంటీర్లు : 'గడికోట'

ప్రజాశక్తి-రామాపురం

సంక్షేమ పథకాలకు ప్రజలకు అదించడంతో వాలంటీర్లు వారధులు నిలిచారని ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం మండల కేంద్రం రామాపురంలో వాలంటీర్లకు వందనం కార్యక్రమంలో భాగంగా వాలంటీర్లకు పురస్కార ప్రదానం కార్యక్రమంలో స్థానిక ప్రజా ప్రతినిధులు, నాయకులతో కలిసి పాల్గొన్నారు. మాజీ ఎంపిపి గడికోట జనార్దన్ రెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో శ్రీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ ప్రజల చెంతకే పాలనను సిఎం జగన్ అందిస్తున్నారని అన్నారు. రెండువేలు జనాభా దాటిన ప్రతి గ్రామానికి సచివాలయాన్ని తీసుకొచ్చి పరిపాలనను సరళీకరించిన ఘనత తమ ప్రభుత్వానిదేనని చెప్పారు. ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధిలా నిలబడి సేవాభావంతో లంచాలు లేకుండా, వివక్షతకు తావులేకుండా సేవలందిస్తున్న గ్రామ, వార్డు వాలంటీర్లను ప్రోత్సహిస్తూ నాల్గవ ఏడాది వాలంటీర్లకు వందనం కార్యక్రమాన్ని నిర్వహిస్తు న్నారని అన్నారు. మహాత్మా గాంధీ కలలు కన్న గ్రామ స్వరాజ్యం సాధన దిశగా సిఎం జగన్ సచివాలయ వ్యవస్థను నెలకొల్పి, ప్రజలకు సేవ చేసే సదవకాశాన్ని యువతకు కల్పించారన్నారు. గ్రామ వాలంటీర్లు ప్రజలకు, అధికారులకు మధ్య వారధులుగా ఉండి ప్రభుత్వ పథకాలను ప్రజల గడపకు నేరుగా చేరవేస్తున్నారని అన్నారు. మండలంలోని వాలంటీర్లు అంద రినీ పేరు పేరునా పలకరిస్తూ పురస్కారాలు అందచేశారు. కార్యక్రమంలో ఎంపిడిఒ ప్రభాకర్ ఇఒఆర్‌డి ఉషారాణి, జెడ్‌పిటిసి మాసన వెంకట రమణ, మార్కెట్ కమిటీ చైర్మన్ కర్ణపు విశ్వనాథరెడ్డి, వైస్ ఎంపిపిలు రవి శంకర్‌రెడ్డి, బాబు, సింగల్ విండో అధ్యక్షులు పెద్దిరెడ్డి, ఆదినారాయణ రెడ్డి, వడ్డెర కార్పోరేషన్ డైరెక్టర్ ఆంజనేయులు మాజీ రెస్కో చైర్మన్ కృష్ణారెడ్డి, వెంకట సుబ్బారెడ్డి, సర్పంచ్‌లు, ఎంపిటిసిలు, వాలంటీర్లు పాల్గొన్నారు.



సేవా పురస్కారాలు అందుకున్న వాలంటీర్లతో శ్రీకాంత్‌రెడ్డి

పేదలకు వరం సిఎం సహాయనిధి : 'కొరముట్ల'



లబ్ధిదారులకు చెక్కును అందజేస్తున్న కొరముట్ల

ప్రజాశక్తి-రైల్వేకోడూరు

ముఖ్యమంత్రి సహాయనిధి నిరుపేదలకు వరం లాంటిదని ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు పేర్కొన్నారు. పట్టణంలోని వైసిపి కార్యాలయంలో రూ.15 లక్షలు విలువ చేసే సిఎం సహాయనిధి చెక్కులను లబ్ధిదారులకు కొరముట్ల అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరోగ్యశ్రీ కార్డులేని పేదలకు సిఎం సహాయనిధి ద్వారా ఆర్థిక సాయం అందించి పేదల జీవితాల్లో వెలుగు నింపుతున్నారని అన్నారు. ప్రజారోగ్య పరిరక్షణకు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఎంతో కృషి చేస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో ఎపి టూరిజం డైరెక్టర్ సాయికిషోర్ రెడ్డి, జిల్లా టూరిజం డైరెక్టర్ సుధాకర్‌రాజు, ఉప సర్పంచ్ తోటశివసాయి, సర్పంచ్ శివయ్య, హరికృష్ణ రెడ్డి, ప్రసాద్‌రెడ్డి, విజయ్ భాస్కర్ రెడ్డి, కృష్ణారెడ్డి, ఎంపిటిసి బండారు మల్లికార్జున, రవి, నాగరాజు పాల్గొన్నారు.

తప్పని 'ఇకెవైసి' కష్టాలు



ఇకెవైసి కోసం గ్యాస్ ఏజెన్సీ వద్ద నిరీక్షిస్తున్న వినియోగదారులు

ప్రజాశక్తి-గాలివీడు

గ్యాస్ వినియోగదారులకు సబ్సీడి అందాలంటే తప్పని సరిగా ఇకెవైసి చేయించుకోవాలని చెప్పడంతో గ్యాస్ ఏజెన్సీ చుట్టూ వినియోగదారులు బారుతీరుతున్నారు. మండల కేంద్రంలోని గాలివీడులో హెచ్‌పి గ్యాస్ ఏజెన్సీలో సర్వర్ పనిచేయక పోవడంతో గంటల తరబడి నిరీక్షించాల్సి వస్తోందని వినియోగదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరో పక్క ఇళ్ల పట్టాల రిజిస్ట్రేషన్ కోసం సచివాలయాల వద్ద పడిగాపులు తప్పడం లేదని అంటున్నారు. సర్వర్, బయోమెట్రిక్ డివైస్‌లు, ఇతర సాంకేతిక కారణాలతో రిజిస్ట్రేషన్లు నత్త నడకన సాగుతున్నాయి. రిజిస్ట్రేషన్‌ల కోసం రోజుల తరబడి సచి వాలయాలు చుట్టూ తిరుగుతున్నామని మహిళలు వాపోతున్నారు. మహిళలు ఉదయం సచివాలయం వద్దకు వచ్చి సాయంత్రం వరకు పడిగాపులు కాసిన కూడా రిజిస్ట్రేషన్ కావడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వ్యవసాయ కూలీలైన మహిళలు పనులు మానుకొని సచివాల యాల చుట్టూ తిరుగుతున్నా రిజిస్ట్రేషన్ పూర్తి కావడం లేదని మహిళలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఒక పక్క గ్యాస్ సబ్సీడి కోసం, మరొక పక్క ఇళ్ల పట్టాల రిజిస్ట్రేషన్ కోసం ఇకెవైసి కష్టాలు తప్పడం లేదని అంటున్నారు. అధికారులు స్పందించి సాంకేతిక లోపాలను లేకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

సిఎం సభకు 62 ఆర్‌టిసి బస్సులు తరలింపు

- బస్సులు లేక ఇబ్బంది పడ్డ ప్రయాణికులు


ప్రజాశక్తి-పీలేరు

పీలేరు ఆర్‌టిసి బస్టాండ్‌లో బస్సులు లేక శనివారం బోసి పోయింది. పల్లె ప్రాంతాలకు వెళ్లే బస్సులు కూడా రద్దు చేయడంతో తమ గమ్యాలకు చేరాల్సిన ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురౌతున్నారు. అనంతపురం జిల్లా, రాప్తాడులో ఆదివారం జరిగే ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి సిద్ధం సభకు ఒక రోజు ముందే పీలేరు ఆర్‌టిసి డిపో నుంచి 62 బస్సులు సిద్ధం చేసి తరలించారు. పీలేరు డిపోలో అద్దె బస్సులతో సహా మొత్తం 85 ఆర్‌టిసి బస్సులు ఉండగా అందులో 62బస్సులు సిఎం సభకు తరలించడంతో ప్రయాణికులు తీవ్ర అసౌకర్యానికి లోనయ్యారు. దూరా భారం వెళ్లే ప్రయాణీకులు వరుసగా రెండు రోజులు బస్సులుండవని తెలిసి తీవ్ర అసహనాన్ని వ్యక్తం చేశారు. పీలేరు బస్టాండులో కనీసం పల్లెవెలుగు బస్సు సర్వీసులు కూడా లేని పరిస్థితి ఏర్పడింది. ఇక ప్రయివేట్ వాహనాలు కూడా అంతంత మాత్రంగానే ఉన్నాయంటూ తమ కష్టాలను ఏకరువు పెట్టారు. జగన్‌రెడ్డి ప్రభుత్వానికి ప్రజా ప్రయాణికుల ప్రయోజ నాలు పట్టవని, పార్టీ నేతల సభలు, సమావేశాలే ముఖ్యమని పలువురు ప్రయాణికులు ఆరోపించారు.



బస్సుల కోసం పడిగాపులు కాస్తున్న ప్రయాణికులు

మార్కెట్లో కల్తీ నూనె..



ఆయిల్ కింది భాగంలో పేరుకుపోయి ఉన్న కల్తీ

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

మన వంటకాల్లో ఎక్కువగా ఉపయోగించేది నూనె. కొన్ని రోజులుగా వంట నూనె ధరలు విపరీతంగా పెరిగిపోగా.. ప్రస్తుతం ధరలు దిగి వచ్చాయి. లీటర్ వంటనూనె ప్యాకెట్ దాదాపు రూ.120 నుంచి రూ.150లోపే ఉంది. ధర ఎంత ఉన్నా.. కొనడం మాత్రం తప్పనిసరి. ఎందుకంటే నూనె లేనిదే వంటలు చేయలేం. ఒక వైపు ధరలు మండిపోతుంటే.. మరో వైపు కల్తీ నూనెలు మార్కెట్లోకి ఇబ్బడిముబ్బడిగా వచ్చి చేరుతున్నాయి. నకిలీ వంట నూనెలు అమ్ముతూ ప్రాణాలతో చెలగాట మాడుతున్నారు మోసగాళ్లు. అవసరాలను ఆసరా చేసుకుని కొందరు మోసగాళ్లు కల్తీ నూనెలు తయారు చేస్తూ మోసాలకు పాల్పడుతున్నారు. ప్రస్తుతం ఆహార పదార్థాల్లో కల్తీ అనేది ప్రధాన సమస్యగా మారింది. కల్తీకి ఎంత చెక్ పెట్టినా.. ఏదో విధంగా మార్కెట్లోకి వస్తూనే ఉంది. ఆహార పదార్థాలు కల్తీ వల్ల మనకు తెలియకుండానే పలు రోగాలు దరి చేరుతున్నాయి. ఇలాంటి కల్తీ నూనె వల్ల ఎన్నో రోగాలు చుట్టుముట్టి ఆస్పత్రుల చుట్టు తిరగాల్సిన పరిస్థితి వస్తోంది. ఇటీవల ఓ కంపెనీకి చెందిన ఆయిల్ టిన్ కొనుగోలు చేసి, ఓ సందర్భంగా సగం ఆయిల్ ఉపగించారు. అనంతరం మూడు రోజుల గ్యాప్ తర్వాత ఆయిల్ వంటకు ఉపయోగించే క్రమంలో వేడి చేస్తుంటే ఇల్లంతా ఎముకలు కుళ్లిన వాసన రావడంతో ఒక్కసారిగా ఇంట్లో వాళ్లంతా అవాక్కయ్యారు. వెంటనే పట్టణంలోని కొనుగోలు చేసిన షాప్ వద్దకు ఆ ఆయిల్ టిన్ తెచ్చి ఇలా దుర్వాసన వస్తుంది అని చెబితే.. మాకు సంబంధం లేదు.. డీలర్‌ను అడగండి అని డీలర్ నెంబర్ ఇచ్చారు. ఆ తర్వాత డీలర్ కూడా తమకు సంబంధం లేదని చేతులు ఎత్తేశారు. జమ్మలమడుగు పట్టణంలో కల్తీ నూనెలు అధికంగా ఉన్నాయి. ఫుడ్ అండ్ విజిలెన్ క్వాలిటీ అధికారులు షాప్‌లపై దాడులు చేసి కల్తీ వ్యాపారుల నుంచి ప్రాణాలను కాపాడాలని ప్రజలు కోరుతున్నారు.

టిన్ అడుగుభాగాన కొవ్వు వంటి పదార్థం



ఓ కంపెనీ ఆయిల్ టిన్ కొనుగోలు చేశాం. వంటకు ఉపయోగిస్తూ ఆయిల్ వేడి చేస్తుంటే ఎముకలు కుళ్లిన వాసన వస్తుంది. టిన్ లోపల ఏమైనా ఉందా అని చూస్తే ఆయిల్ అడుగు భాగాన కరిగిన కొవ్వులా ఉంది. పాదం సంలా కింద ఉంది. దీనిపై ప్రశ్నిస్తే షాపు యజమాని, డీలర్ ఒకరిమీద ఒకరు పెట్టుకుంటున్నారు. జమ్మలమడుగు ప్రజలు మేలుకోవాలి. అధికారులు చొరవ తీసుకొని ప్రజల ఆరోగ్యాన్ని కాపాడాలి.

- గురుశంకర్, వినియోగదారుడు, రాజీవ్ నగర్ కాలనీ, జమ్మలమడుగు



అధికారులకు సూచనలిస్తున్న జెసి ఫర్మాన్‌అహ్మద్ ఖాన్

పకడ్బందీగా గ్రూప్-2 పరీక్షలు : జెసి

ప్రజాశక్తి-రాయచోటి

జిల్లాలో ఈనెల 25న జరగబోయే గ్రూప్-2 పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని జాయింట్ కలెక్టర్ ఫర్మాన్‌అహ్మద్ ఖాన్ అధికారులను ఆదేశించారు. శనివారం గ్రూప్-2 పరీక్షలపై వివిధ శాఖల అధికారులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా జెసి మాట్లాడుతూ ఎపిపిఎస్‌సి ఇచ్చిన మార్గదర్శకాల ప్రకారం పరీక్షను పక్కాగా నిర్వహించాలన్నారు. పరీక్ష హాల్లో ఎటువంటి కాపీయింగ్ జరగకూడదని ఎలక్ట్రానిక్ వస్తువులను అనుమతించరాదని సూచించారు. పరీక్షా కేంద్రాలలో ఇబ్బందులు తలపెట్టిన వారిపై ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని పోలీసు అధికారులను ఆదేశించారు. అనంతరం వివిధ శాఖల సిబ్బందికి వారికి కేటాయించిన విధుల గురించి తగు సూచనలు చేశారు. సమావేశంలో విద్య, వైద్య, విద్యుత్ శాఖల అధికారులు పాల్గొన్నారు.

చంద్రబాబును గెలిపించుకోవాల్సిన బాధ్యత మనందరిది

ఖాజీపేట: రానున్న ఎన్నికల్లో ముఖ్యమంత్రిగా చంద్రబాబును గెలిపించుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని, ప్రజలందరూ టిడిపికే పట్టం కట్టాలని మైదుకూరు నియోజకవర్గం టిడిపి ఇన్‌ఛార్జి పుట్టా సుధాకర్ యాదవ్ పేర్కొన్నారు. శనివారం స్థానిక అగ్రహారంలో బాబు ష్యూరిటీ.. భవిష్యత్తు గ్యారంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన టిడిపి మినీ మేనిఫెస్టో గురించి ప్రజలకు వివరిస్తూ కరపత్రాలను పంపిణీ చేశారు. రానున్న ఎన్నికల్లో ప్రజలందరూ తెలుగుదేశం పార్టీకే ఓటు వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో టిడిపి మండలశాఖ అధ్యక్షుడు తిప్పిరెడ్డి లక్ష్మిరెడ్డి, సీనియర్ నాయకులు సందుల నాగశివారెడ్డి, భూమయపల్లె సర్పంచ్ కొంగాని వెంకటసుబ్బయ్య యాదవ్, రామసుబ్బయ్య, రాష్ట్ర ముస్లిం మైనారిటీ నాయకులు ఫరూక్ అహ్మద్, బొంగు శీను, సరిటాల వీరయ్య, పిచ్చి నాయుడు, మిరపకాయలు సుబ్బిరెడ్డి, హబీబ్, త్రిపురవరం హరినాథ్‌రెడ్డి, దాసరి శ్రీనివాసులు యాదవ్ పాల్గొన్నారు.



గోడపత్రాలను ఆవిష్కరిస్తున్న బహుజనసేన నాయకులు

20న ఐక్యతా ర్యాలీని జయప్రదం చేయండి

ప్రజాశక్తి-బి.కొత్తకోట

మదనపల్లిని జిల్లాను చేసి ఇక్కడి ప్రజల మనోభావాలను గౌరవించాలని బహుజనసేన నాయకులు పేర్కొన్నారు. ఈనెల 20 మదనపల్లి జిల్లా ఆకాంక్షను నెరవేర్చాలని కోరుతూ మదనపల్లిలో జరిగే సమరభేరి-సకలజనుల ఐక్యతా ర్యాలీని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. శనివారం పట్టణంలోని స్థానిక జ్యోతి చౌక్‌లోని అంబేద్కర్ విగ్రహం ఎదుట గోడపత్రాలను ఆవిష్కరణ చేశారు. ఈ కార్యక్రమానికి బహుజనసేన రాష్ట్ర అధ్యక్షులు, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, సిపిఐ నియోజకవర్గపు కార్యదర్శి ఎస్.మనోహర్‌రెడ్డి మాట్లాడుతూ మదనపల్లిజిల్లా సాధనకై ఎన్నో ఉద్యమాలు, అక్రమ అరెస్టులు జరిగాయని అన్నారు. అధికారంలోకి వస్తే ఖచ్చితంగా మదనపల్లి జిల్లాను ప్రకటిస్తామని హామీ ఇచ్చినటువంటి ప్రతిపక్ష పార్టీల కూటమికి తమ ఎన్నికల మేనిఫెస్టోలో మదనపల్లి జిల్లా ఏర్పాటు ప్రక్రియను చేర్చాలని పేర్కొన్నారు. అన్ని హంగులు మదనపల్లెను, పుంగనూరు, పీలేరు, తంబళ్లపల్లె నియోజకవర్గాలను కలిపి జిల్లాగా కేటాయించాలని డిమాండ్ చేశారు. ,మన గొంతుకతో రాష్ట్రానికి వినపడేలా-మన మదనపల్లి హంగులు కనపడేలా ఉద్యమించాల్సిన తక్షణ అవసరమున్నదని అన్నారు. మదనపల్లిలోని ఎస్టేట్ వద్ద నుంచి ర్యాలీ ప్రారంభమవుతుందని అనంతరం అంబేద్కర్ సర్కిల్ వద్ద బహిరంగసభ జరుగుతుందని తెలిపారు.ర్యాలీకి నియోజకవర్గం నుంచి అధిక సంఖ్యలో మేధావులు, విద్యార్థులు, యువకులు, మహిళలు, కార్మికులు, కర్షకులు పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో బహుజనసేన రాష్ట్ర కార్యదర్శి కొండుపల్లి ఆనంద్, ఎఐటియుసి మండల అధ్యక్షులు జి.రఘునాథ్, సిపిఐ మండలకార్యదర్శి డి.చిన్నరెడ్డప్ప, పట్టన కార్యదర్శి ఎం.అష్రఫ్అలి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు కొండకిందపల్లి, కృష్ణారెడ్డి, కార్మిక నాయకులు గంగులప్ప, నారాయణస్వామి, ఉత్తన్న, గంగాధర్, రమేష్, దుమ్ము, బాబు, ఖాదర్ బాషాలు, చంద్ర, సతీష్, నరసింహ, రవి పాల్గొన్నారు.



విద్యార్థులకు విద్యా సామగ్రిని అందిస్తున్న సంస్థ సభ్యులు

విద్యార్థులకు విద్యా సామగ్రి వితరణ

ప్రజాశక్తి-పుల్లంపేట

మండల పరిధిలోని అనంతసముద్రం పంచాయతీలోని ఎన్.బోట మీదపల్లి గ్రామంలో శనివారం సర్వేజనా సేవా సమితి ఆధ్వర్యంలో పుల్లంపేట, ఓబులవారిపల్లిలో ప్రభుత్వ పాఠశాలల్లో పదవ తరగతి చదువుతున్న విద్యార్థులకు విద్యా సామగ్రి పంపిణీ చేశారు. ప్రతి సంవత్సరం కూడా సోమా జనార్దన్‌యాదవ్ వర్ధంతి సందర్భంగా ఈ కార్యక్రమాన్ని చేపడు తున్నట్లు తెలిపారు. 14 సంవత్సరాలుగా తమ స్నేహితుని ఆశయాన్ని నెరవేర్చుకోవడానికి ఈ విధమైన టువంటి సేవా కార్యక్రమాలు చేయడం అభినందనీయమని ఎంఇఒలు చక్రధర్, తిరుమల రావు అన్నారు. ఈ సంవత్సరము విద్యా సామగ్రితో పాటు పుల్లంపేట, ఓబుల వారిపల్లి మండలాలలో గత సంవత్సరము పదవ తరగతిలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన ప్రథమ, ద్వితీయ విద్యార్థులకు నగదు బహుమతి, మెడల్స్‌ను అందిస్తామని ఎలిపారు. కార్యక్రమంలో సర్వేజన సేవా సమితి సభ్యులు గ్రామస్తులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఖాతాలను స్తంభింపజేయడం దిగజారుడు తనమే

- పిసిసి మీడియా చైర్మన్ ఎన్.తులసిరెడ్డి

ప్రజాశక్తి - వేంపల్లె

ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ, యవజన కాంగ్రెస్ బ్యాంకు ఖాతాలను స్తంభింపజేయడం బిజెపి దిగజారుడుతనానికి నిదర్శనమని పిసిసి మీడియా చైర్మన్ తులసిరెడ్డి పేర్కొన్నారు. శనివారం వేంపల్లెలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ సుప్రీంకోర్టు తీర్పుతో ఎన్నికల బాండ్లు నిషేధం అమల్లోకి వచ్చిన క్షణం నుండి అక్రమ మార్గంలో వేల కోట్ల రూపాయల ఎన్నికల ఫండింగ్ పొందిన బిజెపికి భయం పట్టుకుందన్నారు. ప్రతి పక్షాలను వేధించి పైశాచిక ఆనందాన్ని అనుభవిస్తూ గెలుపుపై బిజెపి పగటి కలలు కంటోందన్నారు. రహస్య మూలల నుండి క్విబ్ ప్రోక్రో ద్వారా వేల కోట్ల రూపాయలు ఎన్నికల ఫండింగ్ పొందిన హీనమైన చరిత్ర బిజెపికి సొంతమైతే పారదర్శకత, జవాబుదారీతనం కోసం సమాచార హక్కు చట్టాన్ని అమల్లోకి తెచ్చిన ఘనత కాంగ్రెస్ పార్టీకి దక్కుతుందన్నారు. అధికార పైత్యంలో కాంగ్రెస్ పార్టీని ఇరుకున పెట్టేందుకు ప్రయత్నించడం శోచనీయమన్నారు. కాంగ్రెసు పార్టీ సత్యమేజయతే అనే సూత్రాన్ని పాటిస్తుందన్నారు. బిజెపి ఉడుత ఊపులకు భయపడేది కాదన్నారు. కాంగ్రెసు పార్టీ అధికారం కోసం అడ్డదారులు పాటించదని తెలిపారు. విలువలకు కేరాఫ్ కాంగ్రెస్ పార్టీ అన్నారు. రానున్న ఎన్నికల్లో బిజెపికి గుణపాఠం తప్పదని ఆయన తెలిపారు.

భవిత కేంద్రానికి చేయూత

ప్రజాశక్తి - వేంపల్లె

స్థానిక భవిత కేంద్రంలో విద్యాభ్యాసం చేస్తున్న విభిన్న ప్రతిభావంతుల విద్యార్థులకు ప్రభుత్వం చేయూ తనిస్తున్నట్లు ఎంపిడిఒ సంపతి దివిజా పేర్కొన్నారు. శనివారం స్థానిక భవిత కేంద్రంలోని విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం సరఫరా చేసిన ఉపకరణాలను ఎంపిడిఒ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భవిత విభిన్నప్రతిభావంతుల విద్యావనరుల కేంద్రంలో చదువుతున్న విద్యార్థులకు ఉచితంగా వీల్‌చైర్స్ ఉచితంగా పంపిణీ చేసినట్లు చెప్పారు. బేబి, షబీరా, అదానమ్, గంగాధర్, జ్యోతి చిన్నారులకు వీల్‌చైర్స్ అడిగిన వెంటనే మంజూరు చేయడం సంతోషకరంగా ఉందని చెప్పారు. భవిత కేంద్ర సిబ్బంది చక్కగా అన్ని కార్యక్రమాలను చేపడుతున్నట్లు తెలిపారు. అనంతరం అనారోగ్యంతో బాధపడుతున్న జ్యోతి అనే విభిన్నప్రతిభావంతురాలికి ఎంఇఒ జాఫర్ సాదిక్ రూ.1000 నగదును అందజేశారు. కార్యక్రమంలో ఎంఇఒ-2 స్టాలిన్ ఐజాక్, ఐఇఆర్టీలు యశోద, సుజాత, ఫిజియోథెరపీ డాక్టర్ ఆనంద్, మెయిన్ స్కూల్ హెచ్‌ఎం రాజేశ్వరమ్మ, ఉపాధ్యాయురాలు సుకన్య, ఎంఐఎస్ అబ్దుల్ ఖాదర్, చిన్నారులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

గండి అంజన్నను దర్శించుకున్న ఇఇ గంగయ్య

ప్రజాశక్తి - చక్రాయపేట

దేవాదాయ ధర్మాదాయ డిఇగా పనిచేస్తున్న కాకర్ల గంగయ్య ఎగ్జిక్యూటివ్ ఇంజినీరుగా ప్రమోషన్ పొందారు. ఈ సందర్భంగా శనివారం ఆయన గండిలోని ఆంజనేయస్వామిని దర్శించుకున్నారు. అనంతరం ఆలయ అసిస్టెంట్ కమిషనర్ అలవాలపాటి ముకుందరెడ్డి శాలువా కప్పి పూలమాలతో ఘనంగా సన్మానించారు. శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ప్రధాన, ఉప ప్రధాన అర్చకులు కేసరి స్వామి, రాజా స్వామి, ఇఒ నిఖిల్ పాల్గొన్నారు.

అగౌరవపరిస్తే ఫిర్యాదు చేయండి

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

ప్రభుత్వ కార్యాలయాల్లో మహిళా ఉద్యోగుల పట్ల అగౌరవపరిచేలా సహ ఉద్యోగులు వ్యవహరిస్తే చట్టం ప్రకారం శిక్షకు గురవుతారని జమ్మలమడుగు జూనియర్ సివిల్ కోర్టు జడ్జి భార్గవి తెలిపారు. శనివారం నాగులకట్టలోని ప్రభుత్వ బాలికల కళాశాల వసతి గృహంలోని వంట గది, బాత్ రూమ్‌లను ఆమె పరిశీలించారు. సబ్ జైలును సందర్శించి న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. అనంతరం కోర్టులో మహిళ పోలీస్ కానిస్టేబుల్స్, మున్సిపల్ ఆఫీసులో పనిచేసే మహిళా ఉద్యోగులకు పోష్ చట్టం-2013 గురించి అవగాహన కల్పించారు. మహిళా ఉద్యోగుల పట్ల సహచర ఉద్యోగులు సత్ప్రవర్తనతో మెలగాలన్నారు. అసభ్య పదజాలం వాడడం, ఎగతాళి చేయడం నేరమన్నారు. సహచర ఉద్యోగస్తుల నుంచి ఎవరైనా ఇబ్బందికి గురవుతూంటే నేరుగా కోర్టుకుగానీ లేదా టోల్ ఫ్రీ నెంబర్‌కుగాని ఫోన్ చేయవచ్చని తెలిపారు. కార్యక్రమంలో న్యాయవాదులు, కోర్టు సిబ్బంది, మహిళ ఉద్యోగులు పాల్గొన్నారు.